# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం 22 జూలై 2024 పేజీలు 8


# సెక్రటేరియట్ చుట్టూ తిరిగేంత ఓపిక నాకు లేదు

- నా రెండు దరఖాస్తులు చెత్త బుట్టలోకి వెళ్లాయేమోనని డౌట్ వస్తోంది: మాజీ డీఎస్పీ నళిని
- గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన నళిని
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే, నళిని అంశం ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి
- కానీ ఇప్పుడు తన గురించి చప్పుడు చేయడంలేదంటున్న నళిని





-2లో

**హైదరాబాద్ పెన్ పవర్:**గతంలో తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా ఉన్న సమయంలో డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేయడం ద్వారా వార్తల్లోకెక్కిన నళిని... తాజాగా సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఉద్యమంలో పాల్గొన్న వాళ్లకు తమ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని, నళిని కావాలనుకుంటే డీఎస్పీ ఉద్యోగంలో తిరిగి చేరొచ్చని, లేకపోతే ప్రభుత్వంలో మరేదైనా ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, నళిని పెట్టి తాజా పోస్టు ప్రాధాన్యత సంతరించుకుంది. "సీఎం సార్ కొలువు చేపట్టగానే నన్ను గుర్తు చేసుకున్నారు. ఇప్పుడేమే దాని గురించి ఏమీ మాట్లాడంలేదు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగాయి. కానీ నా ఊసే ఎత్తకపోవడం ఆశ్చర్యం కలిగించింది. నేను ప్రభుత్వానికి చేసుకున్న రెండు దరఖాస్తులు బల్లపై ఉన్నాయో, చెత్తబుట్టలోకి పోయాయో అనే డౌట్ వస్తోంది. ఇప్పుడే చీఫ్ సీఆర్ఓను,

# ఎన్నికల్లో ఓడిపోయి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీని దేశ రాజకీయాల్లో మొదటిసారి చూస్తున్నాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కిషన్ రెడ్డి విమర్శలు
- గత ఎన్నికల్లో బీజేపీపై తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశారని ఆగ్రహం
- ఆ రెండు పార్టీల వ్యవహారశైలిలో ఏమాత్రం మార్పు లేదని వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీని దేశ రాజకీయాల్లో మొదటిసారి చూస్తున్నామని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు, కుట్రలు చేశారని... బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వ్యవహారశైలిలో ఏమాత్రం మార్పులేదని ధ్వజమెత్తారు. ప్రజల తీర్పుకు విరుద్ధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారని, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుంటోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు పార్టీలు మజ్లిస్ తో స్నేహాన్ని కొనసాగిస్తున్నాయని ఆరోపించారు.



**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పెద్దవాగును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. పెద్దవాగు ఆనకట్టకు పడిన గండ్లను అధికారులతో కలిసి విజిట్ చేశారు. మరమ్మతు పనులపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. పెద్దవాగు గండికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.వర్షం ప్రభావిత గ్రామాల్లో ప్రతి కుటుంబానికి నిత్యం భోజనం, ఇంటింటికి బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి. ప్రతి ఇంటికి వైద్యసిబ్బందిని పంపించాలని.. డెంగ్యూ లాంటి విషజ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రతిగ్రామంలో అధికారులు పర్యటించాలని.. ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని చెప్పారు.

# పెద్దవాగు పరివాహకప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల





# గోదావరికి పోటెత్తుతున్న వరద... సమీక్ష చేపట్టిన మంత్రి పొంగులేటి

- తెలంగాణలో భారీ వర్షాలు
- ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి పొంగులేటి


**హైదరాబాద్ పెన్ పవర్:**గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద ముంపు వల్ల ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని, ఈ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ

-2 లో



# జాతీయ జెండా ధ్వంసం..! పట్టించుకోని యంత్రాంగం..!

- మహబూబాబాద్ జిల్లాలో జాతీయ పతాకంపై నిర్లక్ష్యం..
- రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతీయ పతాకాన్ని 100 అడుగుల ఎత్తులో ఆవిష్కరణ..
- భద్రతా దృష్ట్యా ఫెన్సింగ్, గార్డెనింగ్, సి.సి కెమెరాల ఏర్పాటు.. పర్యవేక్షణ లేమితో నిర్లక్ష్యం..



%జాతీయ పతాకంపై అధికారుల నిర్లక్ష్యం..

మహబూబాబాద్ జిల్లా, పెన్ పవర్,జూలై 21:తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ జాతీయ పతాకంగా ప్రసిద్ధిగాంచి 100 అడుగుల ఎత్తులో ఆవిష్కరణ గావించిని జాతీయ జెండా నేడు నిర్లక్ష్యానికి గురౌతుంది.. 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో గత ప్రభుత్వంలో అంగరంగవైభవంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సుమారు 20 లక్షల రూపాయల నిధులతో ఆవిష్కరించారు.. దీని భద్రతా దృష్ట్యా ఫెన్సింగ్, గార్డెనింగ్, సి.సి కెమెరాలు ఏర్పాటు చేసిన యంత్రాంగం..! పర్యవేక్షణను విస్మరించి బాధ్యతా రహితంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. తీవ్రంగా వీస్తున్న గాలులకు జాతీయ పతాకం ధ్వంసమై, అధికారుల నిర్లక్షానికి సాక్ష్యంగా దర్శనమిస్తోంది.. తెలంగాణలో ఇది రెండో అతిపెద్ద జాతీయ పతాకంకగానూ..! ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రప్రథమంగా ఆవిష్కరించిన భారతదేశ గౌరవం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు..దేశ స్వాతంత్ర్యం కోసం, ఐక్యత కోసం తన, మన, ధన, ప్రాణత్యాగాలు చేసిన వారందరినీ గుర్తుచేసే, వారి త్యాగాల స్ఫూర్తితో..! నవభారత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలనే గొప్ప సంకల్పంతో అప్పటి ఎమ్మార్వో రాఘవరెడ్డి నేతృత్వంలో తొర్రూరులో భారీ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం జాతీయ జెండా చినిగిన పరిస్థితిలో ఉండటం పలువురిని బాధిస్తుంది.

# సెక్రటేరియట్ చుట్టూ తిరిగేంత ఓపిక నాకు లేదు

- మొదటి పేజి తరువాయి

ఓఎస్డీని ఈ విషయమై సంప్రదించాను. ఇదే విషయమై లేఖ కూడా రాశాను. చిన్నప్పుడు అడుక్కునేవాళ్లు ఇంటి ముందుకు వస్తే ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి వెళ్లవయ్యా అని మెల్లగా చెప్పేవాళ్లం. కనీసం ఆ పాటి మర్యాద అయినా నాకు ఇస్తారేమో చూడాలి. అందుకే నేను ఇన్నాళ్లు ఎవరినీ కలవలేదు. ఉద్యమం చేసేటప్పుడే నాకు చాలా విషయాలు అర్థం అయ్యాయి. కేవలం ఒక నెలలోనే నా పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తి చేస్తారనుకున్నాను... కానీ ఏడు నెలలు కావస్తోంది. అందుకే రిమైండర్ లేఖ రాయాల్సి వచ్చింది. ఈ పోస్టు కూడా దాని గురించే. సెక్రటేరియట్ చుట్టూ తిరిగే ఓపిక, సమయం నాకు లేవని ఆ రోజే నేను రేవంతన్నకు చెప్పాను" అంటూ నళిని తన పోస్టులో వివరించారు.

# గోదావరికి పోటెత్తుతున్న వరద... సమీక్ష చేపట్టిన మంత్రి పొంగులేటి

- మొదటి పేజి తరువాయి

బృందాలను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు కూడా వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఉప్పొంగుతున్న వాగుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలెవరూ వాగులు దాటకుండా చూడాలని సూచించారు. రాష్ట్రస్థాయి అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, వారిని జిల్లా స్థాయి అధికారులు ఎప్పుడైనా సంప్రదించవచ్చని ద

మంత్రి పొంగులేటి వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా ఇంకా వర్షాలు కురుస్తున్నందున జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# ఉజ్జయినీ మహంకాళీ బోనాలు: సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు





**హైదరాబాద్ పెన్ పవర్:**గతేడాది రంగంలో అమ్మవారు భవిష్యవాణిని బాగా చెప్పారు. అంతా బాగుంటుందని చెప్పారు. అలాగే జరిగింది. మరి ఈసారి అమ్మవారు ఏం చెబుతారో అని భక్తులు ఎదురుచూస్తున్నారు. రేపు సోమవారం ( జులై22) రంగం కార్యక్రమం సందర్భంగా సికింద్రాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్? ఆంక్షలు విధించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి బోనాన్ని అమ్మవారికి ఈ రోజు ( జులై 21) సమర్పించారు. కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు.ఆ తరువాత సీఎం రేవంత్ రెడ్డి, అమ్మవారిని దర్శించుకొని, బోనాలు సమర్పించారు.

**ట్రాఫిక్ ఆంక్షలు**

సాధారణంగానే సికింద్రాబాద్ అమ్మవారి ఆలయ ప్రాంతం రద్దీగా ఉంటుంది.ఉజ్జయినీ మహంకాళీ బోనాల సమయంలో మరింత రద్దీగా ఉంది. ఈ కారణంగా 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి 2 కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంచారు.

**భక్తుల వాహనాల పార్కింగ్ ఎక్కడంటే:**

ఆలయానికి వాహనాలపై వచ్చే భక్తులు%ా% హరిహర కళా భవన్, మహబూబ్ కాలేజ్, ఓల్డ్ జైల్ ఖానా ఓపెన్ ప్లేస్, ఇస్లామియా హైస్కూల్, గవర్నమెంట్ అదయ్య మెమోరియల్ హైస్కూల్, అదయ్య క్రాస్ రోడ్స్, రాణిగంజ్, సికింద్రాబాద్, మహాత్మాగాంధీ విగ్రహం, %MG% రోడ్, బెల్సన్ తాజ్‌హోటల్, అంజలి థియేటర్, పరేడ్ గ్రౌండ్‌లో వాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చు. ఇందుకోసం అక్కడ ప్రత్యేక స్థలాలను పోలీసులు ఎరేంజ్ చేశారు.

**వాహనదారులకు అలర్ట్:**

కర్బలా మైదాన్, రాణిగంజ్, రాంగోపాల్‌పేట్ ఓల్డ్ పీఎస్, ప్యారడైజ్, సంగీత్ క్రాస్ రోడ్స్, ప్యాట్నీ క్రాస్ రోడ్స్, పార్క్‌లేన్, బాటా, బైబిల్ హౌస్, మినిస్టర్ రోడ్, రసూల్‌పురా వైపు వచ్చే వాహనదారులు ఇతర మార్గాలు ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

**రంగంపై ఆసక్తి:**

ప్రతీ సంవత్సరం ఈ బోనాల ఉత్సవాల్లో రంగం జరపడం ఆనవాయితీ. అమ్మవారి వేషధారణలో ఉన్న మహిళ భవిష్యవాణి చెబుతారు. దీన్ని భక్తులు ఎంతో శ్రద్ధతో తెలుసుకుంటారు. గతేడాది రంగంలో స్వర్ణలత భవిష్యవాణి చెప్పారు.

అంతా బాగుంటుందనీ, తనను బాగా చూసుకోవాలని కోరారు. తాను భక్తులను చూసుకుంటానని అన్నారు. దాంతో అంతా బాగానే జరిగింది. ఈ సంవత్సరం ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. మరి అమ్మవారు రంగంలో ఏం చెబుతారో అనే ఆసక్తి ఉంది.

# మూసీ ఖర్చును ప్రభుత్వం మూడింతలు పెంచింది: కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ నది సుందరీకరణకు అయ్యే ఖర్చును ప్రభుత్వం మూడింతలు పెంచిందన్నారు మాజీ మంత్రి కేటీఆర్. మొదట రూ.50 వేల కోట్లు,రెండోసారి రూ. 70 వేల కోట్లు..ఇపుడు లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారు..మూసీ అంచనా వ్యయం పెంచడం కాంగ్రెస్ ధన దాహానికి సజీవసాక్ష్యం అని అన్నారు. చివరిదశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పక్కనపెట్టి.. కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి మూసీ చుట్టే ఎందుకింత మంత్రాంగం..?? అని ట్వీట్ చేశారు కేటీఆర్. లండన్ లోని థేమ్స్ లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి ? గేమ్ ప్లాన్ ఏంటి ? అని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో బ్యాక్ డోర్ లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం అనుక్షణం గమనిస్తోందన్నారు. కుంభకోణాల కాంగ్రెస్ కు కర్రుగాల్చి వాత పెడుతుందన్నారు కేటీఆర్.

వచ్చే ఐదేండ్లలో 1.50 లక్షల కోట్లు ఖర్చు చేసి మూసీ నదిని లండన్ లోని థేమ్స్ రివర్ లా అభివృద్ధి చేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి జూలై 20న చెప్పిన సంగతి తెలిసిందే.. ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూసీ అభివృద్ధిని చూడగానే ప్రజాప్రభుత్వం గుర్తుకు వచ్చేలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

# అమెరికాలో ఆగ్రా యువకుడి కాల్చివేత.. షాకింగ్ వీడియో!

### ట్రాఫిక్ సిగ్నల్ వద్ద మరో వాహనదారుడితో గొడవ

### తుపాకీ తీసుకుని ఆవేశంతో డ్రైవర్ పైకి వెళ్లిన యువకుడు

### కోపంతో అరుస్తుండగా కాల్పులు జరిపిన అమెరికన్



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలోని ఇండియానాలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వాహనదారుల మధ్య రేగిన గొడవ ఓ ఇండియన్ అమెరికన్ ప్రాణాలు తీసింది. తుపాకీ తీసుకుని తనపైకి వచ్చిన యువకుడిపై అమెరికా పౌరుడు కాల్పులు జరిపాడు. దీంతో బుల్లెట్ గాయాలపాలైన యువకుడిని ఎమర్జెన్సీ సిబ్బంది ఆసుపత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఈ ఘటనలో చనిపోయిన యువకుడు ఇండియాలోని ఆగ్రాకు చెందిన వాడని, రెండు వారాల క్రితమే వివాహం జరిగిందని పోలీసులు వెల్లడించారు.

ఆగ్రాకు చెందిన గేవిన్ డసౌర్(29) అమెరికాలోని ఇండియానాలో నివాసం ఉంటున్నాడు. జూన్ 29 న మెక్సికన్ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో కిందటి మంగళవారం ఇండియానాలోని ఓ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద మరో వాహనదారుడితో గేవిన్ గొడవపడ్డాడు. మరో కారులో ఉన్న అమెరికన్ పైకి తుపాకీతో వెళ్లాడు. కారు డోర్ ను కొడుతూ అమెరికన్ పై అరవడం వీడియోలో కనిపిస్తోంది. గేవిన్ అరుపులకు బదులుగా సదరు అమెరికన్ తన తుపాకీ తీసి గన్ పాయింట్ లో కాల్పులు జరిపాడు. ఇదంతా పక్కనే ఉన్న మరో డ్రైవర్ తన సెల్ ఫోన్ కెమెరాలో రికార్డు చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా, బుల్లెట్ గాయాలతో కుప్పకూలిన గేవిన్ ను ఆయన భార్య ఆసుపత్రిలో చేర్పించింది. పరిస్థితి సీరియస్ గా ఉండడంతో గేవిన్ ను ఐసీయూలో చేర్చి వైద్యులు చికిత్స చేపట్టారు. అయితే, పరిస్థితి విషమించడంతో తాజాగా గేవిన్ కన్నుమూశాడని వైద్యులు తెలిపారు.

# ఇన్ స్టా రీల్స్ కోసం బైక్ స్టంట్స్.. హయత్ నగర్ లో యువకుడి మృతి..

ప్రాణాపాయ స్థితిలో మరో యువకుడు

వర్షంలో స్టంట్స్ చేస్తుండగా స్లిప్ అయిన బైక్

కిందపడ్డ యువకులను ఆసుపత్రికి తరలించిన స్థానికులు



**హైదరాబాద్ పెన్ పవర్:**సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు యువత చేస్తున్న స్టంట్స్ ప్రాణాంతకంగా మారుతున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో ఇన్ స్టా రీల్స్ కోసం బైక్ స్టంట్స్ చేస్తూ ఇద్దరు యువకులు ప్రమాదానికి గురయ్యారు. వర్షంలో స్టంట్స్ చేస్తుండగా బైక్ స్లిప్ కావడంతో ఇద్దరూ కిందపడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలై ఓ యువకుడు అక్కడికక్కడే చనిపోయాడు. బైక్ పైనుంచి పడ్డ యువకులను స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఓ యువకుడు అప్పటికే చనిపోయాడని వైద్యులు వెల్లడించారు. తీవ్ర గాయాలపాలైన మరో యువకుడిని ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. హయత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై పెద్ద అంబర్‌పేట్ సమీపంలో ఇద్దరు యువకులు బైక్‌తో స్టంట్ చేశారు. సింగిల్ వీల్‌పై బైక్ నడుపుతూ హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడగా.. శివ అనే యువకుడు చనిపోయాడు. బైక్ నడిపిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## కన్నులవిందుగా రాయికల్ జలపాతం.. పర్యాటకుల కేరింతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రకృతి పచ్చని అందాలు.. జలపాతాల సోయగాల కోసం ప్రకృతి ప్రేమికులు బయలుదేరుతారు. కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం రాయికల్ జలపాతాలకు పర్యాటకుల తాకిడి తాకింది. గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, చెరువులు, వంకలు కలకళను సంతరించుకున్నాయి. జలపాతాలు పొంగిపొర్లుతున్నాయి. ములుగు జిల్లాలోని బొగత వాటర్ వాల్స్, అదిలాబాద్ లోని కుంతల, ఇంకా పలు ప్రాంతాల్లో చిన్న చిన్న జలపాతాలు చూడచక్కని దృష్యాలుగా మారాయి. దీంతో విజిటర్స్ తో ఆయా ప్రాంతాల్లో సందడి పెరిగింది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ తోపాటు వాటర్ వాల్స్ చూడడానికి వస్తున్నారు.

# రాందేవ్ కు లేని అభ్యంతరం రహ్మాన్ కు ఎందుకు?.. యూపీ సర్కారు ఆదేశాలపై యోగా గురు ప్రశ్న

హోటల్ యజమానులు తమ పేర్లు వెల్లడించడానికి అభ్యంతరం దేనికని నిలదీసిన రాందేవ్ బాబా

చేసే పనిలో స్వచ్ఛత, నిజాయితీ ఉంటే ఏ మతమైనా ఒకటేనని వివరణ

కన్వర్ యాత్ర మార్గాల్లో హోటల్స్ పై నేమ్ ప్లేట్ తప్పనిసరి చేసిన యూపీ సర్కారు




**హైదరాబాద్ పెన్ పవర్:**కన్వర్ యాత్ర సాగే మార్గాల్లోని హోటళ్లు, ఇతర తినుబండారాల యజమానులు తమ పేర్లను హోటల్ బోర్డుపై ప్రదర్శించడం తప్పనిసరి చేస్తూ ఉత్తరప్రదేశ్ సర్కారు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 న కన్వర్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఆదేశాల అమలుపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టిపెట్టింది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన హోటళ్లు, తినుబండారాల దుకాణాలను తొలగిస్తామని హెచ్చరించింది. అయితే, ఈ నిర్ణయంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ మండిపడుతున్నాయి. ప్రజల్లో మతపరమైన విభేదాలు సృష్టించేందుకు యోగి సర్కారు ఈ ఆదేశాలు జారీ చేసిందని, ఓ వర్గం వారిని టార్గెట్ చేసిందని పలువురు విపక్ష నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ సర్కారు ఆదేశాలను సమర్థిస్తూ ప్రముఖ యోగా గురు రాందేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఆదేశాలపై రాందేవ్ బాబాకు లేని అభ్యంతరం రహ్మాన్ కు మాత్రం ఎందుకని నిలదీశారు. మనం చేసే పనిలో స్వచ్ఛత, నిజాయితీ ఉన్నంత కాలం మన మతమేదైనా పెద్దగా పట్టింపులోకి రాదని స్పష్టం చేశారు. వ్యక్తిగత గుర్తింపునిచ్చే పేరును వెల్లడించడంలో సమస్య ఏముందని ప్రశ్నించారు. ప్రతీ ఒక్కరూ తమ పేరు పట్ల గర్వంగా ఫీలవ్వాలని చెబుతూ పేరును దాచుకోవాల్సిన అవసరం లేదన్నారు. చేసే పనిలో స్వచ్ఛత ఎంతనేదే చూస్తారు తప్ప ఆ పని చేసే వ్యక్తి హిందువా, ముస్లిమా లేక క్రిస్టియనా లేక మరొకటా అనేది ఎవరూ చూడరని రాందేవ్ బాబా గుర్తు చేశారు.

# కారుకు సైడ్ ఇవ్వలేదన్న కారణంతో స్కూటర్‌పై ద వెళ్తున్న మహిళ ముఖంపై రక్తం కారేలా పిడిగుద్దులు!

మహారాష్ట్రలోని పూణెలో ఘటన

కారు ఆపి మహిళ జుట్టు పట్టుకుని లాగి ముఖంపై పంచ్‌లు

వీడియో వైరల్ కావడంతో నిందితుడు, అతడి భార్య అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఓవర్ టేక్ చేసేందుకు అవకాశం ఇవ్వకుండా స్కూటర్ నడుపుతోందన్న ఆగ్రహంతో ఓ మహిళపై దాడిచేసి పిడిగుద్దులు కురిపించిన వ్యక్తిని, ఆయన భార్యను పూణె పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్కూటర్‌పై వెళ్తున్న డిజిటల్ కంటెంట్ రైటర్ జెర్లిన్ డిసిల్వా తనకు ఓవర్‌టేక్ చేసే అవకాశం ఇవ్వకుండా అడ్డుకుంటోందన్న ఆగ్రహంతో కారు ఆపిన స్వప్నిల్ కేక్రే మహిళ వద్దకు వెళ్లి జుట్టు పట్టుకుని లాగి ముఖంపై పిడిగుద్దులు కురిపించాడు. దీంతో ఆమె ముక్కుకు తీవ్ర గాయమై రక్తం కారింది.

తనపై జరిగిన దాడికి సంబంధించి జెర్లిన్ ఓ వీడియోను విడుదల చేసింది. పాషాన్–బానెర్ లింక్ రోడ్డులో తన ఇద్దరు పిల్లలతో కలిసి స్కూటర్‌పై వెళ్తుండగా నిందితుడు కేక్రే కారు రెండు కిలోమీటర్ల పాటు తన వెనక వేగంగా వచ్చిందని పేర్కొన్నారు. దీంతో తాను రోడ్డు పక్కకు తప్పుకుని కారుకు దారిచ్చానని, తన స్కూటర్‌ను ఓవర్ టేక్ చేసిన నిందితుడు కారు ఆపి కోపంగా వచ్చి తన ముక్కుపై రెండుసార్లు గుద్దాడని, తన జుట్టు పట్టుకుని లాగాడని పేర్కొంది.తన ఇద్దరు పిల్లలు చూస్తున్నా అతడు లెక్క చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నగరం ఇంత సురక్షితమా? అని వాపోయింది. మనుషులు ఇంత ఉన్మాదంగా ఎందుకు తయారవుతున్నారని ప్రశ్నించింది. తనతో ఉన్న పిల్లలకు ఏమైనా అయి ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. తనకో మహిళ సాయం చేసిందని పేర్కొంది. ఈ ఘటనతో పిల్లలు భయపడిపోయారని పేర్కొంది. వీడియో వైరల్ కావడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు, అతడి భార్యను అరెస్ట్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నీటిమట్టాలు ఎలా ఉన్నాయంటే..?

## రెండు రోజులుగా రెండు రాష్ట్రాల్లో దంచికొడుతున్న వానలు

## ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు

## ప్రాజెక్టుల్లోకి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ, తెలంగాణలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లోని వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతాన్ని ముంచెత్తిన వర్షానికి వరద నీరు తెలంగాణలోని ప్రాజెక్టులకు వచ్చి చేరుతోంది. దీంతో తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు పెరిగాయి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరుందనే వివరాలు..

కృష్ణా నదిపై ఉన్న జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 318.5 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 317.5 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఇన్ ఫ్లో 76 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నుంచి అధికారులు 84,236 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 813 అడుగులకు చేరింది. ప్రస్తుతం 82,396 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. ప్రాజెక్టు ఇప్పట్లో నిండుకునే సూచనలు కనిపించకపోవడంతో అధికారులు నీటిని కిందికి వదలడం లేదు.

నాగార్జున సాగర్.. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు. ప్రస్తుత నీటిమట్టం కేవలం 123 టీఎంసీలు మాత్రమే. ఇన్ ఫ్లో 4,694 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. 8,480 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.ప్రకాశం బ్యారేజీ.. పంటకాలువలకు ఔట్ ఫ్లో 1,309 క్యూసెక్కులు కాగా 7,125 క్యూసెక్కుల నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

**గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులు..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1,091 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1,066 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి వరద నీరు 19 వేల క్యూసెక్కులుగా ఉందని అధికారులు వెల్లడించారు. ఔట్ ఫ్లో ఏమీలేదు.

మిడ్ మానేరు.. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం కేవలం 5.57 టీఎంసీలు మాత్రమే ఉంది. మిడ్ మానేరులోకి 236 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, 62 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు: ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 402 అడుగులు. ప్రస్తుతం 2,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఔట్ ఫ్లో ఏమీలేదు. కాగా, భద్రాచలంలో గోదావరి నది ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరికకు దగ్గరగా.. అంటే 33.5 అడుగులకు చేరుకుంది.

పోలవరం ప్రాజెక్టు.. స్పిల్ వే ఎగువ 30.6 మీటర్లు, స్పిల్ వే దిగువ 20.6 మీటర్లు, కాపర్ డ్యామ్ ఎగువ 30.3 మీటర్లు, కాపర్ డ్యామ్ దిగువ 20.15 మీటర్లు.. ప్రస్తుత ఔట్ ఫ్లో 5.87 క్యూసెక్కులు.

# ఉజ్జయినిలోని హొటల్ యజమానుల నేమ్ ప్లేట్ తప్పనిసరి

## ఆదేశాలు జారీ చేసిన ఉజ్జయిని మేయర్

## ఉల్లంఘిస్తే భారీ జరిమానా, హొటల్, స్టాల్ ల తొలగింపు

## ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల బాటలో మధ్యప్రదేశ్ నిర్ణయం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల బాటలో మధ్యప్రదేశ్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. పవిత్ర నగరం ఉజ్జయినిలో హొటళ్లు, తినుబండారాల స్టాల్స్, తోపుడుబళ్ల నిర్వాహకులు తమ పేర్లను వెల్లడిస్తూ బోర్డులు తగిలించాలని ఆదేశాలు జారీ చేసింది. నేమ్ ప్లేట్ లో యజమాని పేరుతో పాటు క్యూఆర్ కోడ్, ఫోన్ నెంబర్ పేర్కొనాలని చెప్పింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించడంతో పాటు సదరు హొటల్, స్టాల్, తోపుడు బళ్లను తొలగిస్తామని హెచ్చరించింది. యాత్రికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, ముస్లింలు తమ లక్ష్యం కాదని ఉజ్జయిని మేయర్ ముఖేష్ తత్వాల్ తెలిపారు.టీవల ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కన్వర్ యాత్ర పవిత్రతను కాపాడాలనే ఉద్దేశంతో యాత్ర సాగే మార్గాల్లోని హొటళ్లు, తినుబండారాల దుకాణాలపై వాటి యజమానుల పేర్లను ప్రదర్శించాలని ఆదేశించింది. కన్వర్ యాత్ర సాగే మార్గంలో పలువురు హిందూయేతరులు హిందూ పేర్లతో షాపులు నిర్వహిస్తున్నారని, భక్తులకు మాంసాహారంతో చేసిన పదార్థాలను విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇదే బాటలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఇదేవిధంగా ఆదేశాలు జారీ చేసింది.

# రోజుకు 14 గంటల పని అంటున్న బెంగళూరు ఐటీ కంపెనీలు...

# తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఐటీ ఉద్యోగులు!

- ఐటీ హబ్ గా ఉన్న బెంగళూరు నగరం
- 14 గంటల పని విధానానికి అనుమతి ఇవ్వాలంటున్న ఐటీ కంపెనీలు
- ఐటీ పరిశ్రమ ప్రతిపాదనను పరిశీలిస్తున్న కర్ణాటక ప్రభుత్వం!
- ఉద్యోగులను యంత్రాల్లా చూస్తున్నారన్న కేఐటీయూ



హైదరాబాద్ పెన్ పవర్:దేశంలో ఐటీ రంగం బాగా వేళ్లూనుకున్న నగరాల్లో బెంగళూరు ఒకటి. అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థలన్నీ బెంగళూరులోనూ తమ కేంద్రాలు తెరిచి, కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అయితే, తాజాగా ఓ ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. రోజులో పనివేళలు 14 గంటలు ఉండాలని బెంగళూరు ఐటీ పరిశ్రమ కోరుతోంది. ఇప్పుడున్న పనిగంటలను 14 గంటలకు పెంచాలని బెంగళూరులోని ఐటీ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. 12 గంటలు సాధారణ పని, మరో రెండు గంటలు అదనపు పని కలిపి మొత్తం 14 గంటల పని అనేది ఈ ఐటీ కంపెనీల ఆలోచన. ప్రస్తుతం 10 గంటల సాధారణ పని, రెండు గంటల అదనపు పని కలిపి మొత్తం 12 గంటల పని విధానానికి కార్మిక చట్టాలు అనుమతిస్తున్నాయి. దీన్ని 14 గంటలకు పెంచాలని ఐటీ కంపెనీలు కోరుతున్నాయి. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం దుకాణాలు, వ్యాపార సముదాయాల చట్టం-1961ను సవరించాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఈ 14 గంటల ప్రతిపాదన కొత్తదేమీ కాదు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలోనే దీని గురించి ప్రస్తావన తెచ్చారు. యంగ్ ప్రొఫెషనల్స్ వారానికి 70 గంటలు పనిచేయాలని నారాయణమూర్తి పేర్కొనగా, అది తీవ్ర చర్చనీయాంశం అయింది. ఆయనపై విమర్శలు కూడా వచ్చాయి. ఇప్పుడు బెంగళూరు ఐటీ పరిశ్రమ ప్రతిపాదన పట్ల కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కర్ణాటక రాష్ట్ర ఐటీ ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) ఈ ప్రతిపాదన పట్ల అభ్యంతరం చెబుతోంది. పని గంటలు పొడిగించడం వల్ల ఐటీ కంపెనీలు మూడు షిఫ్టుల విధానం నుంచి రెండు షిఫ్టుల విధానానికి మారతాయని, ఉద్యోగుల్లో మూడింట ఒక వంతు మంది తమ ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందని కేఐటీయూ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, 14 గంటల సుదీర్ఘ సమయం పాటు పనిచేయడం వల్ల ఐటీ ఉద్యోగుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని స్పష్టం చేశారు. ఐటీ కంపెనీలు 14 గంటల పని ప్రతిపాదన చేయడం ద్వారా, ఉద్యోగులను మనుషుల్లా కాకుండా యంత్రాల్లా చూస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదన పట్ల జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.

# అక్కడ రోజుకొకసారైనా కచ్చితంగా నవ్వాలి.. కొత్త రూల్



హైదరాబాద్ పెన్ పవర్:'నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వలేకపోవడం ఒక రోగం' అనే నానుడి మనందరికీ తెలిసిందే. అయితే, జపాన్?లో జనాలు రోజుకి ఒక్కసారి కూడా నవ్వలేని పరిస్థితిలో ఉన్నారట. అందుకే అక్కడి ప్రభుత్వం ఒక చట్టం తీసుకొచ్చింది. అదేంటంటే.. ఇక ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరూ రోజుకు ఒక్కసారైనా నవ్వాల్సిందే! ఏ దేశంలోనైనా పాలనాపరమైన చట్టాలు చేస్తారు. నేరాన్ని అదుపులోకి తీసుకురావడానికి, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వాలు నిబంధనలు అమలుచేస్తాయి. జపాన్‌లో మాత్రం ప్రతిరోజూ అందరూ నవ్వాలని చట్టం తీసుకొచ్చారు. అది విన్న వాళ్లలో కొందరు ఇదేం చట్టం అని ఆశ్చర్యపోయారు. అయితే, అక్కడి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి ఒక కారణం ఉంది. యమగట విశ్వవిద్యాలయంలోని 'ఫ్యాక్టరీ ఆఫ్ మెడిసిన్' చేసిన రీసెర్చిలో తక్కువగా నవ్వే వాళ్లలో కొందరు పలు వ్యాధులతో చచ్చిపోతున్నారని వెల్లడైంది. అందుకని జపాన్? ప్రభుత్వం రోజులో ఒక్కసారి కచ్చితంగా నవ్వాలనే రూల్? తెచ్చిందన్నమాట. పని ప్రదేశంలో కూడా నవ్వుకునే వాతావరణాన్ని క్రియేట్ చేయాలనీ, ఆ ప్రాసెస్?ని ఎంకరేజ్ చేయాలని కంపెనీలను ఆదేశించింది. ప్రతినెలా ఎనిమిదో తేదీని ప్రత్యేకంగా 'హాస్యంతో ఆరోగ్యం (హెల్త్ విత్ లాఫ్?)' కోసం కేటాయించింది. శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా తీసుకున్నదే ఈ నిర్ణయం. అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటే ఇలాంటి చట్టాలు తీసుకొచ్చారో కదా! అయితే, ఈ చట్టం మీద వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'నవ్వొస్తే నవ్వుతారు. అంతే కానీ కచ్చితంగా నవ్వాలని చట్టం చేయడం ఏంటి?' అంటున్నారు కొందరు. వ్యక్తిగత కారణాల వల్ల కొందరికి నవ్వే పరిస్థితి ఉండకపోవచ్చు. బలవంతంగా నవ్వాల్సిందేననే ఇలాంటి చట్టాలు చేయడమంటే ప్రజల హక్కులను కాలరాయడమే అంటున్నారు. అయితే, ఆ విమర్శలన్నింటినీ అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ కొట్టిపారేసింది. "నవ్వడం అనేది ప్రజల ఇష్టానికే వదిలేశాం. అందుకే కదా నవ్వకపోతే జరిమానా విధిస్తాం... అనేలాంటి అంశాలను చట్టంలో చేర్చలేదు" అంటోంది ఆ పార్టీ.

## రోడ్డు మీద చెత్త వేస్తున్నారా? అయితే జాగ్రత్త



హైదరాబాద్ పెన్ పవర్:రోడ్లపై చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొందరు రోడ్లపై చెత్తవేస్తున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లో బైక్ పై చెత్త కవర్ తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెంబడించారు. రోడ్డుపై చెత్త వేసిన వెంటనే వాళ్లను అడ్డుకుని ఫైన్ వేశారు జీహెచ్ఎంసీ సిబ్బంది. బైక్ ను జీహెచ్ఎంసీ ఆఫీస్ కు తరలించారు. రోజూ ఇంటి దగ్గరకు వచ్చే ఆటోల చెత్త వేయాలని..రోడ్డుపై చెత్త వేయొద్దని సూచించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## మీరు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి.. కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకి మోదీ బర్త్ డే విషెస్



హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేడు 82వ జన్మదినం జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. "రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి" అని ప్రధాని ఎక్స్ ద్వారా విషెస్ తెలిపారు. "ఖర్గేజీ మీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రజల కోసం అలుపెరగకుండా మీరు పనిచేస్తున్న తీరు, అంకితభావం స్ఫూర్తిదాయకం" అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు, ప్రముఖులు ఖర్గేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

# వర్షాకాలంలో పప్పులకు దూరంగా ఉండండి.. ఎందుకంటే..

హైదరాబాద్ పెన్ పవర్:చల్లటి తొలకరి చినుకులతో వాతావరణమంతా ఒక్కసారిగా చల్లగా మారిపోయింది. ఇక ఎప్పుడు ముసురుపట్టి వర్షం పడుతుందో తెలియక ఇబ్బందులు పడుతుంటాం. ఓ పక్క వంటిట్లో వస్తువులు నిల్వ చేసుకోవడం కష్టమంటే, మరోవైపు వర్షాలకు బ్యాక్టీరియా, వైరస్‌లతో సీజనల్ ఫ్లూ జ్వరాలు ఊపందుకుంటాయి. ఇలాంటి వర్షాకాలంలో అందుకు తగ్గట్టు మనం తీసుకునే ఆహారం విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకుంటే పలు రకాల సమస్యల నుంచి బయటపడొచ్చు. ముఖ్యంగా పప్పుధాన్యాలు ఆరోగ్యానికి మంచిదని తినేస్తుంటాం. కానీ ఈ వర్షాకాలంలో ఇలాంటివి అస్సలు తీసుకోకూడదని హెచ్చరిస్తున్నారు నిపుణులు. కారణాలేంటో సవివరంగా చూద్దాం.

పప్పుధాన్యాలు ఆరోగ్యకరమైనవే అయినా వర్షాకాలంలో మాత్రం ఇలాంటి పప్పులకు దూరంగానే ఉండాలి. ఎందకంటే వాతావరణంలోని తేమ శరీరంలోని జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. గ్యాస్, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా బీన్స్, కాయధాన్యాలు, చిక్‌పీస్, బఠానీలు వంటి పప్పుధాన్యాలకు దూరంగా ఉండాలి. వర్షాకాలం వచ్చింది అంటే చాలు చాల రకాల వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. అంటువ్యాధులు, వైరస్, ఇన్ఫెక్షన్లు




వంటి అనేక రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. అందువల్ల వర్షాకాలంలో తీసుకునే ఆహారంపై చాలా శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. అయితే సాధారణంగా మధ్యతరగతి ఇళ్లలో కూరగాయలను కొనుగోలు చేయడానికే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో అయితే కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతాయి. కూరగాయలను కొనుగోలు చేయలేక పప్పులతో గడిపేస్తుంటారు. అయితే వర్షాకాలంలో ఎటువంటి ఆహారం తీసుకోవాలనే ఆలోచన కాకుండా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఆలోచించి మెదులుతుంటారు. అయితే వర్షాకాలంలో సాధారణంగా కొన్ని రకాల ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. పప్పుల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా రకాల మేలు జరుగుతుంది. ముఖ్యంగా వీటిలో ఉండే మెగ్నీషియం, ఫాస్ఫరస్, జింక్, ఐరన్, ప్రొటీన్, ఫైబర్ వంటి అనేక రకాల మినరల్స్ శరీరానికి చాలా విధాలుగా తోడ్పడతాయి.

పప్పులు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కానీ వర్షాకాలంలో కొన్ని రకాల పప్పులు తీసుకోవడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని రకాల పప్పులు తినడం వల్ల శరీరంలో చాలా రకాల సమస్యలు తలెత్తుతాయి. ఎందుకంటే వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల గ్యాస్, కడుపులో మంట, మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి చాలా కడుపు సంబంధింత సమస్యలు తలెత్తుతాయి. పప్పుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. శరీరంలో ఫైబర్ ఎక్కువైనా కూడా సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల రాజ్మా, శెనగలు, పెసర్లు వంటి పప్పులకు దూరంగా ఉంటే **మంచిది.**

**సెనగపప్పు:** సెనగపప్పులో ప్రొటీన్, ఫైబర్, మినరల్స్ ఉంటాయి. ఇవి అజీర్ణం, అపానవాయువుకి దారితీస్తుంది. సెనగపప్పు బరువు నిర్వహణలో, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం తోపాటు మొత్తం జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. మసూర్ పప్పు లేదా ఎర్ర **పప్పు:** వీటిలో ప్రొటీన్, ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, విటమిన్లు సీ, బీలు ఉన్నాయి. అయినప్పటికీ దీనిలో ఉండే రాఫినోస్, స్టాకియోస్ వంటి చక్కెరలు జీర్ణం కావడం కష్టమవ్వడం వల్ల ఇది అపానవాయువుకు కారణమవుతుంది.


**మినపప్పు:** ఎముకల ఆరోగ్యానికి మద్దతునిస్తుంది, శక్తిని పెంచుతుంది. ఇది పొట్టపై భారంగా ఉంటుంది. జీర్ణంమవడం కష్టమవుతుంది. ఇది తేమతో కూడిన వాతావరణంలో అసౌకర్యం, ఉబ్బరానికి దారితీస్తుంది.

తినకూడని ఇతర ఆహారపదార్థాలు..

**వేయించిన ఆహారాలు:** వర్షాకాలంలో రోజూ వేయించిన ఆహారాన్ని తినకుండా ఉండటం చాలా అవసరం. ఇది జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. ఫలితంగా ఆ ఒత్తిడి కాలేయంపై ఏర్పడుతుంది.

# మాకు కాల్స్ ఒక్కటి చాలు డేటా పెద్దగా అక్కర్లేదనుకుంటే ఇటో లుక్కేయండి..

హైదరాబాద్ పెన్ పవర్:భారత్?లో ఇటీవల మొబైల్ రీఛార్జ్ ప్లాన్స్ ధరల పెంపు యూజర్లపై భారం మోపింది. ఆసక్తికర విషయం ఏంటంటే.. టారిఫ్ పెంచిన తర్వాత కూడా ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలోనే రీఛార్జ్ ప్లాన్ల ధరలు తక్కువట. మన దేశంలో జియో, ఎయిర్?టెల్, వీఐ యూజర్లు ఎక్కువ మంది ఉన్నారు. టెలికాం సేవలు పొందుతున్న ప్రీపెయిడ్ కస్టమర్లలో చాలా మంది నెల వారీ రీఛార్జ్ ప్లాన్లను ఎంచుకుంటుంటారు. అలా ప్రతి నెలా రీఛార్జ్ చేసుకునే యూజర్ల కోసం ధరల పెంపు అనంతరం జియో, ఎయిర్ టెల్, వీఐ ఎంతలో రీఛార్జ్ ప్లాన్లను అందుబాటులో ఉంచిందో ఓ లుక్కేద్దాం.




**జియో హీరో 5జీ ప్లాన్:**

349 రూపాయల ధరతో జియో హీరో 5జీ ప్లాన్ అందుబాటులో ఉంది. 28 రోజుల వ్యాలిడిటీతో, రోజుకు 2జీబీ 4జీ డేటా, అన్ లిమిటెడ్ వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్?ఎం?ఎస్?లు ఈ ప్లాన్?లో భాగంగా యూజర్లకు జియో అందిస్తోంది. అన్ లిమిటెడ్ 5జీ డేటాను పొందే వెసులుబాటు కూడా ఈ ప్లాన్?లో ఉంది. జియోలో 399, 449 రూపాయల మంత్లీ ప్లాన్స్ కూడా ఉన్నాయి. 399 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 2.5 జీబీ 4జీ డేటా, 449 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 3జీబీ 4జీ డేటా పొందొచ్చు. అన్ లిమిటెడ్ కాల్స్?తో పాటు ఇతర బెన్?ఫిట్స్ ఉండనే ఉన్నాయి. లేదు.. మాకు డేటాతో పెద్దగా పనిలేదు అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్ మాత్రమే చాలంటారా.. 189 రూపాయల ప్లాన్?తో రీఛార్జ్ చేసుకుని 28 రోజులకు గానూ 2 జీబీ డేటా పొంది, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్?ను ఆస్వాదించొచ్చు.

**వీఐ రూ.349 ప్లాన్:**

వీఐ యూజర్లకు ప్రస్తుతం 349 రూపాయల ప్లాన్ అందుబాటులో ఉంది. ఈ ప్లాన్ తో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1.5 జీబీ 4జీ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్ ను 28 రోజుల వరకూ ఆస్వాదించొచ్చు. కాంప్లిమెంటరీగా రీఛార్జ్ చేసుకున్న మొదటి మూడు రోజుల వరకూ 3 జీబీ డేటా అదనంగా లభిస్తుంది. 299 రూపాయల ప్లాన్?తో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1జీబీ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకునే వెసులుబాటును వీఐ కల్పించింది. వ్యాలిడిటీ 28 రోజులు.

**ఎయిర్‌టెల్ రూ.379 ప్లాన్:**

ఎయిర్ టెల్‌లో అన్ లిమిటెడ్ 5జీ డేటాను ఆస్వాదించాలంటే నెలకు 379 రూపాయల ప్లాన్?తో రీఛార్జ్ చేసుకోవాల్సిందే. రోజుకు 2 జీబీ 4జీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్ ఈ ప్లాన్?లో భాగంగా యూజర్ల పొందుతారు. జియో మంత్లీ ప్లాన్?కు, ఎయిర్‌టెల్ మంత్లీ ప్లాన్‌కు ఉన్న తేడా ఏంటంటే.. జియో ప్లాన్ వ్యాలిడిటీ 28 రోజులు మాత్రమే. ఎయిర్ టెల్ ప్లాన్ వ్యాలిడిటీ 30 రోజులు. అంటే.. ఎయిర్ టెల్ మంత్లీ ప్లాన్ అయితే సంవత్సరానికి 12 సార్లు రీఛార్జ్ చేసుకుంటే సరిపోతుంది. అదే.. జియో హీరో 5జీ ప్లాన్ అయితే సంవత్సరానికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్ టెల్ లో ఇతర మంత్లీ ప్లాన్స్ కూడా 30 రోజుల వ్యాలిడిటీతో అందుబాటులో ఉన్నాయి. 299 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే రోజుకు 1జీబీ 4జీ డేటా లభిస్తుంది. 219 రూపాయలతో రీఛార్జ్ చేసుకుంటే 3జీబీ 4జీ డేటా, అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్ ను 30 రోజుల వరకూ ఆస్వాదించవచ్చు.

# మాతంగి స్వర్ణలత జీవిత చరిత్ర ఇదే.. రెండు శతాబ్ధాల సుదీర్ఘ చరిత్ర కొనసాగింపు...

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆమె ఉజ్జయిని మహంకాళిగా భవిష్యత్తు చెబుతుంది.సంవత్సరంలో ఒకరోజు ( ఆషాఢ బహుళ పాడ్యమి.. సోమవారం.. జులై 22, 2024) ఆమె వైపు భక్తజనమంతా చూస్తుంది.కాని మిగిలిన అన్ని రోజులు ఆమె ఒక సాధారణ టైలర్‌లా జీవితం గడుపుతుంది. మాతంగి స్వర్ణలత జీవన పరిచయం ఇది. రెండువందల ఏళ్ల సుదీర్ఘ చరిత్రకు ఆమె ఒక కొనసాగింపు. నగరమంతా ఆషాఢమాసపు ఆధ్యాత్మికతను సంతరించుకుంటున్న వేళ మాతంగి స్వర్ణలత ప్రస్థానం గురించి తెలుసుకుందాం. .

ఆ క్షణాలు ఉద్వేగభరితం. కోట్లాది జనసందోహం ఆ క్షణాల కోసమే ఎదురు చూస్తుంటుంది. ఏడాదికోసారి వినిపించే ఆ మాటల కోసం ఆ క్షణంలో అంతా ఊపిరి బిగపట్టి ఆలకిస్తారు. ఎందుకంటే ఆ మాటలు ఉజ్జయిని మహంకాళి మధుర వాక్కులు. అవి అందరినీ కాపాడే ఆ చల్లని తల్లి దీవెనలు. ప్రజలంతా సుఖశాంతులతో బతకాలనే ఆకాంక్షలు. అమ్మవారికి ఆగ్రహం వచ్చినా, ఆనందం కలిగినా ఆమె మాటల్లోనే వెల్లడిస్తుంది. పాలించేవారికి దిశానిర్దేశం చేస్తుంది. పాలితులకు మార్గదర్శనం చేస్తుంది. ఆ క్షణాల్లో అమ్మవారు పచ్చికుండతో చేసిన రంగంపైకి ఎక్కి భవిష్యవాణి వినిపిస్తుంది. ఆ అపురూప క్షణాల్లోనే అమ్మవారు మాతంగి స్వర్ణలత అవుతుంది. పసుపు కుంకుమలతో అందంగా అలంకరించుకొని నిండైన విగ్రహంలా కదిలి వచ్చే మాతంగి స్వర్ణలత అప్పుడు ఉజ్జయిని మహాంకాళి ఆవాహనమవుతుంది. రెండు దశాబ్దాలకు పైగా రంగం ఎక్కి భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత ఒక విశిష్టమైన సాంస్కృతిక ఆవిష్కరణ అవుతుంది.

### తరతరాలుగా.. వారసత్వంగా..

ముఖం నిండా పసుపు. పెద్ద పెద్ద కళ్లు. నుదుటిపై నిండుగా ఉన్న కుంకుమ బొట్టు. పసుపు కుంకుమలతో అలంకరించుకొన్న నిండైన దేహం. పచ్చికుండపై నిలిచిన పాదాలు. చేతిలో కిన్నెర. భవిష్యత్తులోకి తొంగి చూసే సునిశితమైన చూపులు. ఆ సమయంలో అమ్మవారిని ఆవాహనం చేసుకున్న స్వర్ణలత రూపం, మాటలు ఎంతో వైవిధ్యంగా ఉంటాయి. ఆమె సాధారణ జీవితానికి పూర్తి భిన్నంగా ఉంటాయి. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తు చెప్పే దైవానికి ఆమె ప్రతిరూపమే అవుతుంది. సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మ హంకాళి అమ్మవారు అవతరించిన తరువాత భవిష్య వాణి వినిపించడం ఒక సాంప్రదాయంగా వస్తోంది.



### అమ్మాయిలంతా అమ్మవారికే..

'ఏర్పుల' వంశానికి చెందిన మహిళలు ఆ సాంప్రదాయానికి ప్రతీకలు. మొట్టమొదట ఏర్పుల జోగమ్మతో ఇది మొదలైంది. ఆ తరువాత ఏర్పుల బాలమ్మ, ఏర్పుల పోశమ్మ, ఏర్పుల బాగమ్మ ఈ సంప్రదాయంలో భాగస్వాములయ్యారు. 1996 వరకు స్వర్ణలత అక్క ఏర్పుల స్వరూపారాణి రంగం ఎక్కి భవిష్యవాణి వినిపించింది. 1997 నుంచి ఇప్పటి వరకు స్వర్ణలత ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. 'మా కుటుంబంలో పుట్టే అమ్మాయిలంతా అమ్మవారికే అంకితం. ప్రతి అమ్మాయి మాతంగి కావలసిందే. ఇప్పటివరకు మాతంగులైన వాళ్లంతా నాతో సహా పెళ్లిళ్లు చేసుకోకుండా తమను తాము మహంకాళికి సమర్పించుకున్న వాళ్లే. మా కుటుంబంలో మా తమ్ము డు దినేష్‌కు ఆడపిల్ల పుడితే తప్పకుండా నా తరువాత ఆమే భవిష్యవాణి వినిపిస్తుంది...అని చెబుతోంది స్వర్ణ.

### స్వర్ణలతకు పెళ్లి అయింది..

పదోతరగతి వరకు చదువుకున్న స్వర్ణలతకు చిన్నవయస్సులోనే 1997లో ముత్యాలమ్మ గుడిలో కత్తితో పెళ్లి జరిపించారు. ఎంతో వైభవంగా ఆ పెళ్లి జరిగింది. ఆ తరువాత ఆమె జీవితం అమ్మవారి సేవకే అంకితమైంది. అప్పటి నుంచే భవిష్యవాణి వినిపిస్తోంది. ఆమె వినిపించే భవిష్యవాణిని ప్రజలే కాదు ప్రభుత్వం కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. భవిష్యవాణిలో చెప్పే సలహాలు, సూచనలను స్వీకరిస్తుంది. ఆ భవిష్యవాణిలో ప్రజలందరి సంక్షేమం నిక్షిప్తమై ఉంటుంది.

### జీవితం కోసం టైలరింగ్

ఏడాదికోసారి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చి లక్షలాది మంది భక్తులు, అధికారగణాలు, అతిరథమహారథులు కొలువుదీరి ఉండే ఆలయ ప్రాంగణంలో ఎలాంటి జంకు లేకుండా, అమ్మవారికి ప్రతిరూపమై భవిష్యవాణి వినిపించే స్వర్ణలత సాధారణ జీవితంలో ఒక టైలర్. ఏ రోజుకు ఆ రోజు పని చేస్తే తప్ప ఇల్లు గడవని నిరుపేద. ఆమె కుటుంబం తుకారాంగేట్‌లోని ఒక చిన్న అద్దె ఇంట్లో నివసిస్తుంది. 'స్వర్ణలత తండ్రి ఏర్పుల నర్సింహా మొదటి నుంచి గుడి దగ్గర పంబజోడు వాయించేవాడు. తల్లి ఇస్తారమ్మ కూడా నాయినతో పాటు గుడికి వచ్చి జేగంట మోగించేది. తరతరాలుగా ఇది వారి వృత్తి. కొంతకాలానికి స్వర్ణలత అమ్మా, నాయిన ఇద్దరూ చనిపోయారు. అప్పుడు ఇంట్లో స్వర్ణలత , తమ్ముడు దినేష్, పిన్ని, వదిన ఉంటున్నాం. దినేష్ ఎలక్ట్రీషియన్. ఇద్దరం కష్టపడితే తప్ప ఇల్లు గడిచేది కాదు. ఎవరైనా ఏమైనా అంటే బతకాలంటే కష్టపడాల్సిందే కదా' అంటూ నవ్వేస్తుంది. స్వర్ణ మంచి లేడీస్ టైలర్. అన్ని రకాల డిజైన్లలో బ్లౌజులు, ఇతర దుస్తులు కుట్టేస్తుంది. ఏడాది పాటు రాత్రింబవళ్లు కష్టపడి పని చేసినా ఏడాదికోసారి వచ్చే ఆషాఢమాసం కోసం మాత్రం ఆమె వేయికళ్లతో ఎదురుచూస్తూనే ఉంటుంది. ఏర్పుల బాగమ్మ మాకు నాయినమ్మ వరుస అవుతుంది. ఆమె ప్రభావం మాపై కొంతవరకు ఉంది. కానీ ఆ తరువాత రంగం ఎక్కిన మా అక్క స్వరూపారాణితో కలిసి నేను గుడికి వచ్చేదాన్ని. ఆమె వారసత్వంగానే నేను వచ్చాను' అంటూ గలగలా నవ్వేసే స్వర్ణకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఊరట లభిస్తుంది.

### రంగం ఒక ఆధ్యాత్మిక వేదిక

ఆషాఢమాసంలో ఉజ్జయిని మహంకాళి వేడుకలు ఆరంభమవుతాయి. గర్భాలయంలోని అమ్మవారి ఆభరణాలు, ముఖాకృతిని అందంగా అలంకరించిన ఘటంతో తీసుకొని రాణిగంజ్‌లోని కర్బలా మైదానానికి ఎదుర్కోలుకు వెళుతారు. సికింద్రాబాద్‌లోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో ఘటంతో ఎదుర్కోలు వేడుకలు నిర్వహిస్తారు. మహంకాళి అమ్మవారు తన ఉత్సవాలకు రావలసిందిగా తన తోటి 18 మంది అక్కచెల్లెళ్లను ఆహ్వానించడమే ఈ ఘటోత్సవం. ఆ తరువాత న్యూబోయిగూడలోని దండు మారమ్మ ఆలయానికి వెళ్తారు. అది మహంకాళి పుట్టినిల్లు. అక్కడి నుంచి గర్భాలయానికి చేరుకోవడంతో ఎదుర్కోలు ఘట్టం ముగుస్తుంది. ఆ తరువాత బోనాల ఉత్సవాలు....రంగంనిర్వహిస్తారు. ఈ ఆధ్యాత్మిక వేదికను స్వర్ణలత తమ్ముడు దినేష్ అలంకరిస్తాడు. పచ్చికుండను కొద్దిగా భూమిలోకి పాతి దాని చుట్టూ బియ్యంతో ముగ్గులు వేస్తారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరిస్తారు. జేగంటలు మోగుతాయి. పంబజోడు ఉత్సవం ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుంది. అదిగో సరిగ్గా ఆ సమయంలోనే ఆలయానికి చేరుకుంటుంది స్వర్ణలత. 'ఆ సమయంలో కొత్త బట్టలు పెట్టి నాకు ఒడి బియ్యం పోసి ఎదుర్కొని వస్తారు. నేరుగా రంగం వద్దకు వస్తాను. ఆ తరువాత ఏం జరుగుతుందో నాకు తెలియదు... అంటున్న మాతంగి స్వర్ణలత ఆ తుదిఘట్టంలో 15 నిమిషాల పాటు భవిష్యవాణి వినిపిస్తుంది. ఆమె వినిపించే భవిష్యవాణి ఈ ఏడాది (జులై , 22,.. 2024) ఎలా ఉంటుందో ఎదురు చూద్దాం.

## రంగం భవిష్యవాణి స్వర్ణలత ఎవరు? ఏం చేస్తుంటారు? ఎవరికీ తెలియని నిజాలు.. ఇవే..

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతి ఏడాది ఆషాఢమాసంలో తెలంగాణ వ్యాప్తంగా బోనాలు జరుపుకుంటారు. హైదరాబాద్, సికింద్రాబాద్ లో కూడా బోనాల ఉత్సవాలను అంగరంగ వైభంగా నిర్వహిస్తారు. అయితే, లష్కర్ బోనాలు మాత్రం రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ఆదివారం... బోనాలు సోమవారం రంగం. ( జులై 22)అయితే, మీకు రంగంరోజు భవిష్యవాణి చెప్పే మాతంగి స్వర్ణలత గురించి మీకు ఏమైనా తెలుసా? అసలు ఈమె ఎవరు? సాధారణంగా ఆమె ఏం చేస్తుంటారు. ఆ వివరాలు తెలుసుకుందాం. ..ప్రతిఏడాది లష్కర్ బోనాల్లో భవిష్యవాణి గురించి ప్రతి ఏడాది ఎదురు చూస్తుంటారు. పచ్చికుండపై నిలబడి మాతంగి స్వర్ణలత భవిష్యవాణిని వినిపిస్తారు. మాతంగిని సరస్వతి మాతతో పోలుస్తారు. స్వర్ణలత ఎరుపుల నర్సింహ్మా, ఇస్తారమ్మ దంపతులకు



జన్మించారు. నర్సింహ్మా అమ్మవారి గుడివద్ద పంబజోడి వాయించేవారు. ఆమె తల్లి కూడా భర్తకు తోడుగా జేగంట మోగించేవారు. స్వర్ణలతకు చిన్నతనంలోనే ముత్యాలమ్మ గుడిలో కత్తితో పెళ్లి చేయించారు. ఆ తర్వాత మాతంగి స్వర్ణలత జీవితం మహంకాళీ అమ్మ సేవకే అంకితం అయింది. ఈమె పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత భవిష్యవాణి వినిపించడం మొదలు పెట్టారు. వారి కుటుంబంలోని ఆడపిల్లలు అమ్మవారికే అంకితం. ఈమె తల్లిదండ్రులు చనిపోయారు... 1996 వరకు అక్క స్వరూపారాణి భవిష్యవాణి చెప్పేవారు ఆమె చనిపోయిన తర్వాత స్వర్ణలత వంతు వచ్చింది.

స్వర్ణలత ఆమె తమ్ముడితోపాటు ఉంటున్నారు. సాధారణ టైలర్ గా జీవిస్తున్నారు. బోనాల సమయంలో కేవలం రాత్రి సమయంలో పాలు మాత్రమే తాగుతారట. బోనాల మరుసటి రోజు ముఖం నిండా పసుపు, పెద్దకుంకుమ తిలకం, ముక్కుకు ముక్కెర, చేతిలో కిన్నెర, మెడలో దండలతో భవిష్యవాణి వినిపిస్తారు స్వర్ణలత .. అమ్మవారిలో గుడిలోకి ప్రవేశించి పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపిస్తారు. సాధారణంగా మాములు కుండపై నిలబడితేనే పగిలిపోతుంది. అలాంటిది పచ్చికుండపై నిలబడి అంతసేపు పూజరి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. ఆ సమయంలో ఏం జరుగుతుందో కూడా ఆమెకు తెలియదట. గత 25 ఏళ్లుగా ఈమె రంగం వినిపిస్తున్నారు. అంతకు ముందు స్వర్ణలత వారి పూర్వీకులు ఈ భవిష్యవాణి వినిపించేవారట. ఇది తరతరాలుగా వస్తోంది. అమ్మవారిని తలచుకుని పచ్చికుండపై నిలబడి ఈ దేశభవిష్యత్తు గురించిన భవిష్యత్తు చెబుతారు.